
సాక్షి
తిరుపతి

మంగళవారం । 24 । జూన్ । 2025



పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్ల వితరణ

శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్లకు భారతి సిమెంట్ పరిశ్రమ వారు బారికేడ్లను వితరణగా అందించారు. - 8లో



బరితెగించిన మట్టి మాఫియా

రామచంద్రాపురం మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా సహజ వనరులను దోచేస్తున్నారు. - 8లో



'కియోస్క్'తో శ్రీవారి లడ్డూలు

శ్రీవారి లడ్డూలను భక్తులు కొనుగోలు చేసుకునేందుకు కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో స్వామివారు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. అనంతరం స్వామివారిని చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూదితో అభిషేకించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రేపే పీజీ సెట్ ఫలితాలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో ఈనెల 9వ నుంచి 12వ తేదీవరకు రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాలలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్–2025 ఫలితాలు బుధవారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు సెట్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 25,688 మంది విద్యార్థులు పలు కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోగా 22 వేలమంది పీజీ సెట్‌కు హాజరయ్యారు.

విద్యార్థినికి అభినందన



ప్రవల్లికను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎ.ప్రవల్లిక లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి 279వ ర్యాంకు సాధించింది. సోమవారం ఈ మేరకు విద్యార్థినిని ప్రిన్సిపల్ నారాయణమ్మ అభినందించారు. ప్రవల్లిక మాట్లాడుతూ గ్రూప్–1 అధికారిగా రాణించడమే లక్ష్యమని తెలిపింది. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి సాయి కుమారి, అధ్యాపకులు భారతి, విజయ కుమారి పాల్గొన్నారు.

ఎస్వీయూ 'సింపోసియా' ప్రారంభం



సెమినార్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి సిటీ : ఎస్వీయూ గణాంకశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ''గణాంకాలు , డేటా సైన్స్‌లో స్థిరమైన అభివృద్ధి'' అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న సింపోసియా సెమినార్ సోమవారం ప్రారంభమైంది. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఐఐటీ విజిటింగ్ ప్రొఫెసర్ వీవీరావు ముఖ్యఅతిథులుగా హాజరై సెమినార్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆధునిక కాలంలో డేటా సైన్స్ ప్రధాన భూమిక పోషిస్తోందని తెలిపారు. డేటాసైన్స్‌లో గణాంకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సైన్స్ కళాశాల పిన్సిపల్ ఆచార్య పద్మావతి, గణాంకశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సరోజమ్మ, ఆచార్య వెంకటరమణ రెడ్డి, ఆచార్య జయసుబ్బారెడ్డి, ఆచార్య భారతి, ఆచార్య సుగుణమ్మ, రిటైర్డ్ ఆచార్యులు బాలసిద్ధముని, వెంకటరమణయ్య, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్ రన్



పరుగును ప్రారంభిస్తున్న అతిథులు, క్రీడాకారులు

తిరుపతి కల్చరల్ : అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా సోమవారం తిరుపతిలో ఘనంగా ఒలింపిక్ క్రీడా రన్ చేపట్టారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి మహతి ఆడిటోరియం వరకు రన్ సాగింది. ముఖ్య అతిథులుగా ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలమంచిలి ప్రవీణ్ , ప్రత్యేక ఆహ్వానితుడిగా డీఎస్‌డీఓ ఎన్.శశిధర్ హాజరై ఒలింపిక్ జ్యోతి వెలిగించి పరుగును ప్రారంభించారు. ఈ క్రమంలో ముందుగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి సాయికుమార్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, ఫుట్‌బాల్ సంఘం నేతలు రెడ్డెప్ప, మునెయ్య, కరాటే సంఘం రత్నాకర్, రెజ్లింగ్ కార్యదర్శి ఉదయ్, జన అకాడమీ కిరణ్, బాడీ బిల్డింగ్ సంఘం ప్రతినిధి బద్రి, డీఎస్సీ కోచ్‌లు గోపి, వినోద్, ఇందూజ, ఆది, ప్రేమ్‌నాథ్, సాయి, సుమతి, హరి పాల్గొన్నారు.



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

ఓట్ల కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెబుతారా..? అధికారం కోసం అందరినీ మోసం చేస్తారా..? గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేస్తారా..? ఎక్కడ జాబ్ క్యాలెండర్..? ఏవీ లక్షల ఉద్యోగాలు..? ఏదీ నిరుద్యోగ భృతి..? ఏమైంది ఫీజు రీయింబర్స్‌మెంట్..? ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు తిలోదకాలిచ్చేస్తారా..? ఇదెక్కడి న్యాయం..? ఇదేనా మంచి ప్రభుత్వం అంటే..? ఇదేనా సుపరిపాలన అంటే..? మా జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తారా..? అంటూ యువత మండిపడింది. వైఎస్సార్‌సీపీ యువజన.. విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నిరసన గళమెత్తింది. కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగింది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించింది. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుంటే ఉద్యమబాట పడతామని హెచ్చరించింది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల నేతలు, యువత

యువజనాగ్రహం

తిరుపతిలో కదంతొక్కిన యువత

- వైఎస్సార్‌సీపీ యువజన.. విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం.. కలెక్టరేట్ వద్ద ఆందోళన
- ఉద్యోగాల కల్పన.. నిరుద్యోగ భృతిపై గళమెత్తి నిరసన
- హామీలను తుంగలో తొక్కడంపై మండిపాటు

తిరుపతి మంగళం : ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసం నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై యువత ఆగ్రహం వ్యక్తం చేసింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో 'యువతపోరు' పేరుతో కదంతొక్కింది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, తిరుపతి నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్, విద్యార్థి విభాగం నేతలు ఓబుల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో యువతీయువకులు, విద్యార్థులు తరలివచ్చి యువతపోరులో పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలు అమలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం కోసం వెన్నుపోటు పొడుస్తారా అంటూ మండిపడ్డారు. ఇచ్చిన మాట నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద సుమారు రెండు గంటల పాటు శాంతియుతంగా నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌లోకి వెళ్లి డీఆర్‌ఓ నరసింహులకు వినతిపత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఇమ్రాన్‌బాషా, అనిల్‌రెడ్డి, కార్పొరేటర్ ఆరణి సంధ్య, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షులు గీతా యాదవ్, గ్రీవెన్స్ సెల్ నగర అధ్యక్షుడు మద్దాలి శేఖర్, నగర బూత్ కమిటీ ఇన్‌చార్జి సాయికుమారి, మల్లం రవికుమార్‌రెడ్డి, సురేష్, చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు, విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



కలెక్టరేట్ దిశగా సాగుతున్న వైఎస్సార్‌సీపీ నేతల బైక్ ర్యాలీ



ర్యాలీని అడ్డుకునేందుకు యత్నిస్తున్న పోలీసులు



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న యువజన నేతలు

నగరంలో భారీ ర్యాలీ

యువత పోరులో భాగంగా తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అయితే అడుగడుగునా పోలీసులు ర్యాలీని అడ్డుకునేందుకు యత్నించారు. యువతను చెదరగొట్టేందుకు లాఠీలను ఝళిపించారు. తిరుచానూరుకు వెళ్లే మార్గంలోని ఫ్లైఓవర్ కిందే బైక్‌లు పెట్టేసి నడిచివెళ్లాలంటూ ఆంక్షలు విధించారు. అయినప్పటికీ యువత కదం తొక్కింది. భారీ సంఖ్యలో కలెక్టరేట్ వద్దకు చేరుకుని యువతపోరును విజయవంతం చేసింది.

అధికారం కోసం వంచించారు



ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి రావాలనే దురుద్దేశంతోనే చంద్రబాబు అబద్ధపు హామీలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత యువతను వంచించారు. ఏటా 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని దగా చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ దోషులే. యువత తలుచుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయి. ఈ విషయాన్ని వారు గుర్తుపెట్టుకోవాలి. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకుంటే సహించే ప్రసక్తే లేదు. లోకేష్‌కు మంత్రి పదవి కట్టబెట్టడంలో చూపిన శ్రద్ధలో పావువంతు యువత భవిష్యత్‌పై చూపితే లక్షలాది మందికి మేలు చేయవచ్చు. కానీ, చంద్రబాబుకు అధికారమే పరమావధి. ప్రజా సంక్షేమం ఇసుమంత కూడా పట్టదు.

– ఉదయ్‌వంశీ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

జీవితాలతో చెలగాటం



ఉన్నత విద్యను అభ్యసించి బంగారు భవిత కోసం తపించే విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా జీవితాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నారు. కళాశాలలకు సకాలంలో ఫీజు రీయింబర్స్ చేయకపోవడంతో విద్యార్థులను కాలేజీల్లోకి రానివ్వడం లేదు. చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం యువతను బలిపెడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. లేకుంటే మరింత ఉధృతంగా ఉద్యమిస్తాం.

– ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత

యువతకు వెన్నుపోటు గ్యారెంటీ

- బాండ్లు పంచిన జేమ్స్‌బాండ్లు ఎక్కడ ?
- యువతకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : ఉద్యోగాలు కల్పిస్తాం, డీఎస్సీ నిర్వహిస్తాం, నిరుద్యోగ భృతి ఇస్తాం, రూ.10 లక్షల వరకు స్వయం ఉపాధి రుణాలిస్తాం అంటూ కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పి యువతను మోసం చేసిందని, జాబ్ గ్యారెంటీ అనుకున్న వారికి వెన్నుపోటు పొడిచిందని మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. సోమవారం నగరి నియోజకవర్గం నుంచి తిరుపతి కలెక్టరేట్‌కు బయలుదేరిన బైక్ ర్యాలీని వడమాటపేట వద్ద జెండా ఊపి ప్రారంభించారు. రోజా మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో యువత ఆగ్రహావేశాలకు లోనయ్యారన్నారు. ప్రతి నియోజకవర్గంలో 500 మంది నిరుద్యోగులకు 10 లక్షల స్వయం ఉపాధి రుణాలిస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు. 'హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబుకు సీఎం పోస్టు, పవన్‌కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం, లోకేష్‌కు మంత్రి, నాగబాబుకు ఎమ్మెల్సీ పోస్టులు వచ్చాయని ఎద్దేవా చేశారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా

బాండ్లు ఇచ్చి ఎగ్గొట్టారు

ఎన్నికల ముందు ఇంటింటికీ వెళ్లి బాండ్లు పంచిన జేమ్స్‌బాండ్లు నేడు ఎక్కడికెళ్లారని ఆర్కే రోజా ప్రశ్నించారు. పవర్ స్టార్ పవర్ వచ్చాక ఫ్లవర్‌లా మారిపోయారన్నారు. గబ్బర్ సింగ్‌లాగా డైలాగులు చెప్పిన ఆయన రబ్బర్‌లాగా మెలికలు తిరుగుతున్నాడన్నారు. నేడు నిరుద్యోగులు తమకు ఉద్యోగం రాలేదు న్యాయం చెయ్యండని అడగడాని కి వెళితే ఆయన సినిమాల్లో బిగాగా ఉన్నాడన్న సమాధానం వస్తోందన్నారు. డిప్యూటీ సీఎం కనబడటం లేదని ఫ్లెక్సీలు పెట్టే పరిస్థితి వచ్చిందన్నా రు. చంద్రబాబుకు, పవన్‌కు, లోకేష్‌కు స్పెషల్ ఫ్లైట్లు, స్పెషల్ హెలికాప్టర్లుకు ఉన్న డబ్బు నిరుద్యోగ భృతి ఇవ్వడానికి లేదా అని ప్రశ్నించారు. ని రుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే వరకు, 13 నెల ల భృతి ఇచ్చేంతవరకు వారికి అండగా నిల బడి పోరాడుతామన్నారు. నియోజవర్గ యువత విభా గం నాయకులు, పార్టీ నాయకులు, కమిటీ లు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి

తిరుపతి సిటీ : వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి సూచించారు. సోమవారం ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీసీ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ మాట్లాడుతూ ఎన్‌ఈపీ విధానం అమలు చేస్తున్నామని, విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి కావలసిన మానవ వనరులను అందించడంలో కళాశాల కీలక పాత్ర వహిస్తోందన్నారు. ఇప్పటివరకు 5,144 బీఎస్సీ అగ్రి విద్యార్థులు, 1,744 పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 240 పరిశోధన విద్యార్థులు డిగ్రీలు అందుకొని వివిధ సంస్థలలో ఉన్నత స్థానాలలో రాణిస్తున్నారని వివరించారు. వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాబోధనలో సమూలమైన మార్పులు చేపట్టామని, ఈ మేరకు వివిధ నైపుణ్య అభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. అనంతరం అతిథులు చేతుల మీదుగా అకడమిక్ విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సుమతి, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రసంసాపత్రాలు అందిస్తున్న అతిథులు

లింగ నిర్ధారణపై కొరడా

- సాయి సర్జికల్ ఆస్పత్రి సీజ్

తిరుపతి తుడా : తిరుపతి త్యాగరాజ్ నగర్ పాత మెటర్నిటీ హాస్పిటల్ రోడ్‌లోని శ్రీ సాయి సర్జికల్ మెటర్నిటీ హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి ఇమ్యునైజేషన్ అధికారి ఛత్రప్రకాష్ రెడ్డి, డెమో అధికారులు బాబు నెహ్రూరెడ్డి, కిరణ్ కుమార్ తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ప్రైవేటు ప్రాక్టీషనర్స్ ద్వారా సాయి సర్జికల్ ఆస్పత్రికి చిత్తూరు, తమిళ నాడు తదితర ప్రాంతాల నుంచి లింగ నిర్ధారణ పరీక్షలకు గర్భిణులను రెఫర్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు అధికారులు మాట్లాడుతూ స్కాన్ సెంటర్ తనిఖీ చేసేందుకు వచ్చిన తమను ఆస్పత్రి ఎండీ డాక్టర్ కిరణ్‌కుమార్ అడ్డుకున్నారని, తలుపులు మూసివేసి మేనేజ్ చేసేందుకు యత్నించారని వెల్లడించారు. వైద్య విద్యను అభ్యసించని క్లారా అనే ప్రైవేట్ ప్రాక్టీషనర్‌తో లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై క్లారాను ప్రశ్నించగా తనపై ఆస్పత్రి యాజమాన్యం ఒత్తిడి తెచ్చిందని, కుటుంబ అవసరాల కోసం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అంగీకరించారని తెలిపారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేసి విచారణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.



ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రాణదాన ట్రస్టుకు రూ.40 లక్షల విరాళం

తిరుమల: టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు సోమవారం పలువురు భక్తులు రూ.40 లక్షల విరాళం అందజేశారు. ఇందులో రాజస్థాన్‌కు చెందిన ఏకే ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధులు రూ.10,59,000లు, బెంగళూరుకు చెందిన అగర్వాల్ ఇండెక్స్ ఫర్నీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.20 లక్షలు, కోనసీమ జిల్లాకు చెందిన దండుమేను శశాంక్ కృష్ణ రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. వారు డీడీలను తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



టీటీడీ అదనపు ఈవోతో దాతలు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,254 మంది స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.28 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఈక్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లితే అనుమతించమని స్పష్టం చేసింది.

క్లుప్తంగా

ఎరచ్రందనం కేసులో ఐదుగురికి జైలు


ముద్దాయిలతో ఫారెస్ట్ సిబ్బంది

తిరుపతి లీగల్ : ఎరచ్రందనం చెట్లు నరికి తరలించేందుకు యత్నించిన కేసులో ఐదుగురు నిందితులకు ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, రూ.6లక్షల వంతున జరిమానా విధిస్తూ తిరుపతిలోని రాష్ట్ర ఎరచ్రందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు..వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన జి.భాస్కర్ నాయుడు, గువ్వ వెంకటయ్య, , గంగరాజు వెంకట్రామరాజు, షేక్ హఫీజుల్లా, చిత్తూరు జిల్లాకు చెందిన కుర్ర పాటి సురేందర్ నాయుడు 2020 నవంబర్ 14వ తేదీ రాత్రి ఎర్రకొండ అటవీప్రాంతం నుంచి ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడ్డారు. ఐదుగురిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

1న డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ?

తిరుపతి సిటీ: రెండు నెలలుగా ఎదురు చూస్తున్న డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ జూలై 1న విడుదల చేసేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. దీంతో జిల్లాలోని సుమారు 35వేల మంది విద్యార్థులకు కాస్త ఊరట లభించినట్లైంది. ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలై సుమారు 3 నెలలు కావస్తున్నా డబుల్ మేజర్ సబ్జెక్ట్‌ల విధానం పేరుతో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చింది.

బరితెగించిన మట్టి మాఫియా


గుండోడు కణంలో మట్టి దోపిడీని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు


ప్రభుత్వం భూమిలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- రామచంద్రాపురంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- వాల్టాకు తూట్లు పొడుస్తున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- సీపీఎం నాయకుల క్షేత్ర స్థాయి పరిశీలన

రామచంద్రాపురం: మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కూటమి నేతల అండతో యథేచ్ఛగా సహజ సంపదను కొల్లగొడుతూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మట్టి, గ్రావెల్‌ను తరలిస్తున్నారని, అక్రమంగా మైనింగ్ చేస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు మండిపడ్డారు. వారు సోమవారం రామచంద్రాపురం మండలంలోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు.

మండలంలోని కొత్తకండ్రిగ, మిట్టకండ్రిగ, ఎల్‌వీ పురం, గణేషపురం, రాయలచెరువు, గుండోడు కణం ప్రాంతాల్లో కూటమి నేతలు, మట్టి మాఫియా కలిసి కొండలు, గుట్టలను స్వాహా చేస్తున్నారు. ఈ క్రమంలో సీపీఎం నాయకులు వందవాసి నాగరాజు, జయచంద్ర జిల్లా కమిటీ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ భారీగా గుంతలను చూసి ఓబుళాపురం మైనింగ్‌ను తలపించేలా ఇక్కడ మట్టి మాఫియా చెలరేగిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ యంత్రాలతో కొండలు, గుట్టలను తొలిచి ఎర్రమట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

రియల్ ఎస్టేట్, వెంచర్‌లకు తరలింపు

కొండలు, గుట్టలను తవ్వి తీస్తున్న మట్టిని ఇటుక బట్టీలు, ప్రైవేటు వెంచర్లకు, విక్రయిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా కనిపించడం లేదా అని మండిపడ్డారు. భారీగా ముడుపులు తీసుకుంటున్నందువల్లే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘కియోస్క్’తో శ్రీవారి లడ్డూలు


కియోస్క్ వద్ద భక్తులు

తిరుమల : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయానికి టీటీడీ కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నగదు లేకుండా యూపీఐ చెల్లింపుల వెసులుబాటు కల్పించింది. దీంతో భక్తులకు త్వరితగతిన లడ్డూలు కొనుగోలు చేసుకునేలా చర్యలు చేపట్టింది.

ప్రక్రియ ఇలా..

- లడ్డూ కౌంటర్లకు సమీపంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రం వద్దకు వెళ్లాలి.
- దర్శన టికెట్ ఉన్నవారు, దర్శన టికెట్ లేనివారు. అనే రెండు ఆప్షన్లలో ఒకటి ఎంచుకోవాలి.
- టికెట్ వివరాలను యంత్రం ధ్రువీకరిస్తుంది. టికెట్‌లో ఉన్న వ్యక్తుల సంఖ్య ఆధారంగా ప్రతి ఒక్కరికీ రెండు అదనపు లడ్డూలకు అనుమతిస్తుంది.
- దర్శన టికెట్ లేనివారు ఆధార్ నంబర్ ఇవ్వాలి. ఇందులో ప్రతి వ్యక్తికి 2 లడ్డూల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. సరైన ఆప్షన్ ఎంచుకున్న తర్వాత యూపీఐ ద్వారా చెల్లింపు చేయాల్సిన పేజీకి వెళ్లి లావాదేవీలు పూర్తి చేయవచ్చు. చెల్లింపు అనంతరం ముద్రిత రసీదు అందుతుంది. ఆ రసీదుతో లడ్డూ కౌంటర్ల వద్దకు వెళ్లి అదనపు లడ్డూలు పొందవచ్చు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ ప్రవేశపెట్టిన ఈ కొత్త విధానానికి నుంచి విశేష స్పందన లభిస్తోంది.

పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్ల వితరణ


బారికేడ్లు అప్పగిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు


సూళ్లూరుపేట : బారికేడ్లు అప్పగిస్తున్న కంపెనీ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు భారతి సిమెంట్ కంపెనీ వారు సోమవారం 30 బారికేడ్లను వితరణగా అందించారు. భారతి సిమెంటు కంపెనీ మార్కెటింగ్ ఆఫీసర్ పి.రాజు, లోకల్ డీలర్ శ్రీబాలాజీ ఎంటర్‌ప్రైజస్ అధినేత ఎం.నరసింహారెడ్డి చేతులమీదుగా సీఐ గోపీకి బారికేడ్లు అప్పగించారు. రాజు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా భారతి సిమెంట్ తరపున ఏటా పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ముక్కంటి ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్లు అందించినట్లు వివరించారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు 6 బారికేడ్లను భారతీ సిమెంట్ కంపెనీ వారు సోమవారం వితరణగా అందించారు. కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, స్థానిక డీలర్ బద్దెపూడి ధనంజయరెడ్డి చేతులమీదుగా ఎస్‌ఐ బ్రహ్మనాయుడుకు అప్పగించారు.

ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర మ్యూజియం అభివృద్ధి పనులపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మ్యూజియం చీఫ్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) సోమన్ నారాయణ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించారు. అదనపు ఈవో మాట్లాడుతూ మ్యూజియాన్ని ప్రపంచ స్థాయి వస్తు ప్రదర్శనశాలగా తీర్చిదిద్దాలని సూచించారు. భద్రతకు సంబంధించి సీసీ కెమెరాలు, హెడ్ కౌంట్ సెన్సార్లు తదితరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మ్యూజియం ప్రాంగణంలో అభిప్రాయ సేకరణ కోసం ఫీడ్ బ్యాక్ కియోస్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియం తెరిచే సమయం, టికెట్ ధర, కళాఖండాల సంరక్షణ గది, అధికారిక సెల్ఫీ పాయింట్ తదితర అంశాలపై ఆరా తీశారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, ఈఈలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, మనోహర్, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, వీజీవో సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, మ్యూజియం క్యూరేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘మెటాలియన్’లో కార్మికుడికి గాయాలు

– ఆలస్యంగా వెలుగు చూసిన ప్రమాదం

శ్రీకాళహస్తి: రూరల్ మండలం వెలంపాడు వద్ద మెటాలియస్ అలాయ్స్ పరిశ్రమలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అమిత్(26) లెడ్ బ్రాయిలర్ వద్ద పనిచేస్తుండగా కాలుతున్న బొగ్గు ఒంటిపై పడింది. దీంతో అమిత్ తీవ్రంగా గాయపడ్డాడు. నలభై శాతం కాలిన గాయాలతో ఉన్న అమిత్‌ను పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తోంది. కంపెనీ వారు భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడంతోనే అమిత్‌కు ఈ దుస్థితి దాపురించిందని సహచర కార్మికులు వాపోయారు. అమిత్ ఆరోగ్య స్థితిపై మరో వారం రోజులు గడిస్తే గానీ ఏమీ చెప్పలేమని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.

వినతులకు సత్వర పరిష్కారం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి అర్జీకి నిర్ణీత గడువులో సత్వర పరిష్కారం చూపాలని డీఆర్‌ఓ నరసింహులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను డీఆర్‌ఓతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్,సుధా రాణి స్వీకరించారు. గ్రీవెన్స్‌కు మొత్తం 244 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి


ఐశ్వర్య మృతదేహం

సత్యవేడు: అంబికాపురం-ఎంజీనగర్ మధ్యన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. వివరాలు.. పన్నూరు సబ్‌స్టేషన్‌కు చెందిన ఐశ్వర్య(18) మామిడి పంట కోతకు 10మంది కూలీలతో కలసి ట్రాక్టర్‌పై వెళుతుండగా ట్రాలీ బోల్తా పడింది. దీంతో కూలీలు కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఐశ్వర్యను సత్యవేడులోని వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే యువతి మరణించినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నేత రమేష్ డిమాండ్ చేశారు. సత్యవేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎదురుగా వస్తున్న టిప్పర్‌కు దారి ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

నలుగురు ఎర్రదొంగల అరెస్ట్


ఎర్రచందనంతో పాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చంద్రగిరి : శ్రీవారి మెట్టు మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్న నలుగురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ బాలిరెడ్డి సోమవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం ఆదివారం రాత్రి భాకరాపేట రేంజ్‌లోని నాగపట్ల అటవీ పరిధిలోని శ్రీవారిమెట్టు నుంచి చంద్రగిరి వెళ్లే మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారులో తరలిస్తున్న 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నలుగురు నిందితులు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. దుంగలతో సహా నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ వద్దన్నందుకు దాడి

శ్రీకాళహస్తి: ర్యాష్ డ్రైవింగ్ వద్దని కారును మెల్లగా నడపమన్నందుకు తండ్రీకొడుకులపై మెటాలియన్ అలాయ్స్ పరిశ్రమ ప్లాంట్ ఇన్‌చార్జి తన అనుచరులతో కలిసి దాడి చేశారు. వివరాలు.. ఆదివారం రాత్రి శ్రీకాళహస్తి మండలం వెలంపాడుకు చెందిన శివకుమార్ అనే ఫొటోగ్రాఫర్ వెంకటగిరిలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంలో తండ్రితో కలిసి ఇంటికి వస్తున్నాడు. ఇంతలో ప్లాంట్ ఇన్‌చార్జి జితేంద్ర అత్యంత వేగంగా కారులో దూసుకెళ్లాడు. దీంతో కింద పడబోయిన శివకుమార్, తండ్రి పరమేశ్వరయ్య అంత వేగంగా ఎందుకు కాస్త నెమ్మదిగా కారు నడపవచ్చుగా అని సూచించారు. దీంతో ఆగ్రహించిన జితేంద్ర దాడికి పాల్పడ్డారు. గాయపడ్డ శివకుమార్‌ను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే బాధితులే సెక్యూరిటీ పాయింట్ వద్ద అద్దాలు ధ్వంసం చేశారంటూ పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. కాగా దళితులపై దాడి చసిన జితేంద్ర అతడి అనుచరులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకుమార్, పరమేశ్వరయ్యను సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి వెంకటేష్ పరామర్శించారు.

విషమంగా బాలుడి ఆరోగ్యం


వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న గిరిసాయి

చంద్రగిరి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు గిరిసాయి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం చంద్రగిరి సమీపంలోని తూర్పుపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృత్యువాతపడగా పిల్లలు గిరిసాయి, గాయత్రిలు గాయపడ్డారు. గిరిసాయికి తొలుత రుయాలో వైద్య పరీక్షలు నిర్వహించారు. చికిత్సకు ఎలాంటి స్పందన లేకపోవడంతో అధికారులు హుటాహుటిన స్విమ్స్‌కు తరలించారు. ఆదివారం నుంచి అత్యవసర విభాగంలో బాలుడికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం గిరిసాయికి వెంటిలేటర్‌పై చికిత్సను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని, మరో 24 గంటలు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమని వైద్యాధికారులు తెలిపారు. సోమవారం ఈ క్రమంలోనే ప్రమాదంలో మృతి చెందిన గిరిసాయి తల్లిదండ్రులు సిద్ధయ్య, జ్యోతిలక్ష్మి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. వారు స్వగ్రామానికి తరలించి, అంత్యక్రియలను పూర్తి చేశారు.


దుకాణంలోకి దూసుకెళ్లిన టిప్పర్

– రూ.5 లక్షల ఆస్తి నష్టం


టిప్పర్ దూసుకురావడంతో ధ్వంసమైన కేఫ్

రేణిగుంట : కడప-రేణిగుంట రహదారిలోని కరకంబాడి సమీపంలో రోడ్డు పక్కన ఇరానీ కేఫ్‌లోకి సోమవారం మధ్యాహ్నం ఇసుక లోడ్‌తో వెళుతున్న టిప్పర్ దూసుకెళ్లింది. ఆ సమయంలో కేఫ్‌లో జనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. రాజంపేట నుంచి తిరుపతి పరిసర ప్రాంతానికి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ అదుపుతప్పి కట్ట పుట్టలమ్మ దేవాలయం ఎదురుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇరానీ కేఫ్‌లోకి దూసుకెళ్లింది. దీంతో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న టిప్పర్ డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


నగిరి వేణు (ఫైల్)

రాపూరు:పెంచలకోన రహదారిలో సోమవారం వేకువజామున గుర్తుతెలియని వాహన ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. రాపూరుకు చెందిన నగిరి వేణు(48) మోటార్‌సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని గోనుపల్లె నుంచి రాపూరుకు బైక్‌పై వస్తుండగా పెనుబర్తి, ఓబులాయిపల్లె మధ్య ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఒలింపిక్ డే ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్‌రెడ్డి ఒలింపిక్ జ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏటా జూన్ 23న ఒలింపిక్ డేని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరావు, పీడీ డాక్టర్ ముస్తాక్ అహ్మద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టు లింగప్రసాద్ మృతి


లింగప్రసాద్ (ఫైల్)


ఎల్‌పీ భౌతికకాయాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్ : రాయలసీమ రాడికల్ విద్యార్థి రాజకీయాలను ప్రభావితం చేసిన మాజీ మావోయిస్టు నేత కొణిదల లింగప్రసాద్(ఎల్‌పీ)(63) సోమవారం తెల్లవారుజామున తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఊపిరితిత్తుల వ్యాధితో ఆయన ఆస్పత్రిలో చేరారు. రామచంద్రాపురం మండలం ,రావిళ్ల వారిపల్లెలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన లింగప్రసాద్‌కు భార్య సరోజ(52), కుమారుడు కల్యాణ్ శ్రీనివాస్(28) ఉన్నారు. మావోయిస్టు ఉద్యమం ఊపిరి పోసుకున్న 1980 దశకం తొలి తరం రాడికల్ నాయకులలో ఎల్‌పీగా ఆయన ప్రజాభిమానం చూరగొన్నారు. అనేక పోలీసు కేసులను ఎదుర్కొని జైలు జీవితం గడిపారు. తిరుపతి ఓరియంటల్ కళాశాలలో చదువుతూ నాటి పీపుల్స్ వార్ విప్లవ ఉద్యమంలో అడుగు పెట్టారు. అప్పట్లో చిత్తూరు జిల్లా ప్రజలు ఆయన అక్రమ అరెస్టుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా బంద్ సైతం చేపట్టారు. కుప్పం ప్రాంతంలో కిషోర్ పేరుతో అటవీభూముల పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మావోయిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. 1990లో పార్టీ సైద్ధాంతిక విభేదాలతో ఆయన రహస్య జీవితం నుంచి బయటకి వచ్చి మాజీ మంత్రి పరిటాల రవికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఈ మేరకు కన్నుమూసిన లింగప్రసాద్ భౌతిక కాయానికి ఎర్రజెండా కప్పారు. వామపక్ష, మాజీ మావోయిస్టు నేతలు నివాళులు అర్పించారు. అనంతరం తిరుపతి మంగళం రోడ్‌లోని వైకుంఠ ధామంలో సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మావోయిస్టులు చంద్రశేఖర్‌రెడ్డి, అమ్మ గుంట శంకర్, సురేష్, తక్కిలిపాటి ప్రభాకర్, మదన్ శేఖర్, శ్రీరాములు, కిషోర్, పాదం శివన్న, కేశవులు, ప్రసూన, మేర్లపాక చంద్ర, విజయ, సాహితీ వేత్త, ఫిలిం డైరెక్టర్ సొదా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, చిన్నం కాళయ్య, చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.